క్లుప్తంగా

నేటి నుంచి రేషన్ షాపుల్లోనే సరుకుల పంపిణీ

పెనమలూరు: జూన్ ఒకటోతేదీ నుంచి రేషన్ షాపుల్లోనే రేషన్ పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ తెలిపారు. ఆయన శనివారం ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఎండీయూ వాహనాలు రద్దు చేసినందున జూన్ 1వ తేదీ నుంచి రేషన్ రేషన్‌షాపుల్లోనే ఇస్తారన్నారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్‌షాపుల్లో డీలర్లు రేషన్‌కార్డు దారులకు పంపిణీ చేస్తారన్నారు. దివ్యాంగులకు, 65 సంవత్సరాలుపై బడిన వారికి మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ డీలర్ ఇంటికి వచ్చి రేషన్ ఇస్తారని తెలిపారు.

యోగాంధ్రలో పాల్గొనే వారు పేరు నమోదు చేసుకోవాలి

పెనమలూరు: యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేరు నమోదు చేసుకోవాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ పి.భవానిప్రసాద్ అన్నారు. ఈ మేరకు కమిషనర్ శనివారం వివరాలు తెలుపుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా విశాఖపట్నంలో 2 కోట్ల జనాభా యోగాలో పాల్గొనే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. విశాఖపట్నంలో యోగాలో పాల్గొనే వారు, ఆయా సచివాలయాల పరిధిలో ఇతర ప్రదేశాల్లో యోగా చేయాలనుకునే వారు, ఇంట్లో యోగా చేసే వారు తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సచివాలయాల్లో, స్వతహాగా వెబ్‌సైట్‌లో, మెప్మా సిబ్బంది వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 0866- 4054030కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి నివాళి



కంకిపాడు: కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ నిలుస్తుందని పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. మండలంలోని కోలవెన్ను శివారు క్రిస్టియన్‌పేటకు చెందిన పార్టీ సానుభూతిపరుడు తానుచింతల చిన్న ఆదాం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. మాజీ సర్పంచ్ టెక్కెం సతీష్‌కుమార్, నేతలు పాల్గొన్నారు.

రేపటి నుంచి రైల్వే గేటు మూసివేత

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద- సావరగూడెం గ్రామాల మధ్య ఉన్న రైల్వే గేటును జూన్ నెల 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గేటు వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రైల్వే గేటు మరమ్మతుల కారణంగా మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనదారులు గమనించాలని సూచించారు.

ఘనంగా ఎన్టీఆర్ పశువైద్య కళాశాల వార్షికోత్సవం

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాల 15వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ముఖ్యఅతిథి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..శాస్త్ర సంబంధిత విషయాల్లో నిపుణత సాధించడం ద్వారా భవిష్యత్‌లో వృత్తిపరమైన విజయాలు సాధించవచ్చని చెప్పారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా క్రీడా, సాంస్కృతిక, ఎన్‌సీసీ విభాగాల్లో ప్రోత్సహిస్తున్నట్లు శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ జీవీ. రమణ తెలిపారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. యూనివర్సిటీ డీన్ డాక్టర్ కే వీరబ్రహ్మయ్య, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీవీఎస్.కిషోర్, ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.వెంకటశేషయ్య పాల్గొన్నారు.

వైభవంగా వీర్ల అంకమ్మతల్లి ఉత్సవాలు



కంకిపాడు: చిట్టూరి వారి పల్నాటి వీర్ల అంకమ్మ అమ్మవారి ఉత్సవాలు కంకిపాడులో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆర్యవైశ్య ప్రార్థనామందిరం సమీపంలోని దేవస్థానంలో శనివారం తెల్లవారుఝాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. వంశీకులు దేవతలను చేతబట్టిఊరేగింపు జరిపించారు. చిట్టూరి వారి పల్నాటి వీర్ల అంకమ్మ అమ్మవారికి కారంపూడి పీఠా ధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ్ విశేష పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో అమ్మవారి అలంకరణ, ఊరేగింపు కన్నుల పండుగగా సాగింది. దేవతలను చేతబట్టి వంశీకులు నిర్వహించిన గ్రామోత్సవం ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాలను చిట్టూరి వంశీకులు పర్యవేక్షించారు.ఆదివారంతోఉత్సవాలు ముగుస్తాయన్నారు.

అక్రమ నిర్మాణాలపై సీఆర్డీఏ హుకుం

- అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చేందుకు కసరత్తు
- 250కి పైగా అనధికార నిర్మాణాల గుర్తింపు



మండల పరిధిలో నిర్మాణాలు

పెనమలూరు: మండల పరిధిలోని గ్రామాలలో అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఏపీ సీఆర్‌డీఏ ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు హుకుం జారీ చేసింది. దీంతో ప్లాన్‌లు లేకుండా ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వివరాల్లోకి వెళితే..

మండల పరిధిలోని పెనమలూరు, పెదపులిపాక, చోడవరం, వణుకూరు, గోసాల, గంగూరు గ్రామాలు ఏపీ సీఆర్‌డీఏ పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో లేఅవుట్‌లు వేయాలన్నా, అపార్టుమెంట్‌లు, గృహాల నిర్మాణం చేసుకోవాలన్నా, ఏపీ సీఆర్‌డీఏ నుంచి ప్లాన్‌లు మంజూరు చేయించుకోవాలని 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గతంలో గ్రామాల్లో గృహాల నిర్మాణం చేసుకోవాలంటే గ్రామ పంచాయతీలు ప్లాన్లు మంజూరు చేసేవారు.

అడ్డగోలు నిర్మాణాలపై కన్నెర్ర..

విజయవాడ నగరానికి శివారులో పై గ్రామాలు ఉండటంతో ఈ ప్రాంతంలో అక్రమ లేఅవుట్లు, అనధికార నిర్మాణాలు చాలా జోరుగా జరిగాయి. అనధికార నిర్మాణాలు, అక్రమ లేఅవుటులపై సీఆర్డీఏకు ఫిర్యాదులు అందటంతో అధికారులు రంగంలోకి దిగారు. సీఆర్‌డీఏ లెక్కల ప్రకారం 250కి పైగా అనధికార నిర్మాణాలు జరిగినట్లు గుర్తించారు. అక్రమ లేఅవుట్లను కూడా నమోదు చేసుకున్నారు. పెదపులిపాక, చోడవరం, వణుకూరు, గ్రామాలలో అనేక అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. అనధికార నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లను వెంటనే పడగొట్టాలని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అధికారాలు ఇస్తూ సీఆర్‌డీఏ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందాయి.

పెనమలూరులో నోటీసులు..

కాగా పెనమలూరు గ్రామంలో అక్రమ నిర్మాణాలపై గ్రామస్తుడు బద్రినారాయణ చేసిన ఫిర్యాదులపై ఏడుగురు భవన యజమానులకు గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసులు ఇచ్చారు. గ్రామంలో దాదాపు 220 అనధికార భవన నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. 2017 నుంచి 2025 మధ్యలో నిర్మాణాలు చేసిన వారికి గ్రామ పంచాయతీ నోటీసులు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. సీఆర్‌డీఏ ఇచ్చిన ఉత్తర్వులతో గ్రామాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి.

చదరంగం క్రీడా సంబరాలకు సన్నద్ధం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతిమ తదితరులు

విజయవాడస్పోర్ట్స్: చెస్ క్రీడా సంబరాలను విజయవాడ శివారు కానూరులోని స్కాట్స్‌పైన్ స్కూల్‌లో వారం రోజుల పాటు నిర్విరామంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ తెలిపారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, స్కాట్స్‌పైన్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో చెస్ పోటీలు, కోచింగ్ క్యాంప్‌లు, చెస్ ట్రెనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను స్కూల్‌లోని తన చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ నిర్వహించిన కోచింగ్ క్యాంప్ శనివారం ముగిసిందని, జూన్ ఒకటో తేదీ ఆదివారం నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జూన్ 2 నుంచి 6వ తేదీ వరకు గ్రాండ్ మాస్టర్ ఉచిత కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మూడు, నాలుగు తేదీల్లో చెస్ స్కూల్ ట్రెనింగ్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా చెస్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.ఫణికుమార్, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.శివ, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ పి.రేణుక, కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ మేనేజర్‌లు ఎ.మణిరత్నం, పి.రవీంద్ర పాల్గొన్నారు.

అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు



అంబాపురంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

అంబాపురం(విజయవాడరూరల్): నియోజకవర్గంలోని గ్రామాల్లో అధ్వాన్నంగా ఉన్న అంతర్గత రహదారులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. శనివారం విజయవాడ రూరల్ మండలం అంబాపురం, పి.నైనవరం గ్రామాల్లో ఉపాధి పథకం, మండల పరిషత్ నిధులతో నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్లను ఆయన ప్రారంభించారు. అంబాపురం గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన గ్రామ సర్పంచి గండికోట సీతయ్యతో కలిసి ప్రారంభించారు. పి.నైనవరం గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును, రూ.20.25 లక్షలతో నిర్మించిన రోడ్డును గ్రామ సర్పంచి బట్టా సోమయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు వివరించారు. నైరుతి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పంచాయతి అధికారులను ఆదేశించారు. అంబాపురం గ్రామంలో వివాదంలో ఉన్న కామన్ స్థలం కొలతలు చేపట్టాలని మండల తహసీల్దార్ బి.సుగుణకు ఎమ్మెల్యే సూచించగా, కామన్ స్థలం వివాదం కోర్టులో ఉందని, కోర్టు నుంచి ఆదేశాలు వెలువడిన వెంటనే కొలతలు తీస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొడ్డళ్ళ చిన రామారావు, బొప్పన హరికృష్ణ, ఎంపీడీఓ బి.విగ్గిన్స్, ఏఈ ఎస్.శివరామకృష్ణ, పంచాయతి కార్యదర్శి డి.శ్రీనివాసరావు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు కష్టాలు, కన్నీళ్లే

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న పేర్ని నాని

గన్నవరం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో కష్టాలు, కన్నీళ్లు తప్ప ప్రజలకు ఒరిగిందేమి లేదని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఈ నెల 4న జరగనున్న 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు కైలే అనిల్‌కుమార్, సింహాద్రి రమేష్ బాబు, దేవభక్తుని చక్రవర్తి, పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఉప్పాల రాము, జిల్లా పరిశీలకులు జెట్టి గురున్నాథంతో కలిసి ఆయన 'వెన్నుపోటు దినం' నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పేర్ని నాని మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తోందన్నారు. ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను నయవంచనకు గురిచేసిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కూడా చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానాలకు నిరసనగా పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు 'వెన్నుపోటు నిరసన' కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 4న స్థానిక పార్టీ ఆఫీస్ నుంచి శాంతియుత ప్రదర్శనగా తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన, వినతిపత్రం సమర్పించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున్న నిరసన కార్యక్రమానికి తరలివచ్చి సత్తాచాటాలని పిలుపునిచ్చారు. వల్లభనేని వంశీమోహన్‌పై కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు పరకాష్టకు చేరుకున్నాయని తెలిపారు. ఇప్పటివరకు ఆయనపై 11 కేసులు నమోదు చేసి 116 రోజులకుపైగా జైలులో పెట్టిందన్నారు. వంశీమోహన్‌కు ఒక కేసులో బెయిల్ వచ్చే సమయంలో మరో కేసు నమోదు చేస్తుండడం దుర్మార్గమన్నారు. ఎంపీపీలు యరగొర్ల నగేష్, వడ్లమూడి సరోజిని, జెడ్పీటీసీలు కాకర్లమూడి సువర్ణరాజు, అన్నవరపు ఎలిజబెత్‌రాణి, కొమరవల్లి భవాని, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.గౌసాని, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, మండల పార్టీ అధ్యక్షులు శీలం రంగారావు, నీలం ప్రవీణ్‌కుమార్, వింత శంకరరెడ్డి, నక్క గాంధీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



గన్నవరం: మానవతా స్వచ్ఛంద సంస్థ హనుమాన్ జంక్షన్ శాఖ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బాణాల నరసింహారావు, పాటోలు గణేష్‌బాబు ప్రమాణ స్వీకరం చేశారు. స్థానిక ఏలూరు రోడ్డులోని మానవతా కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కోశాధికారిగా ఘంటా ఇందిరాదేవి, ఉపాధ్యక్షులుగా రేవిణిశెట్టి సూర్యనారాయణ, సహాయ కార్యదర్శిగా మరీదు వెంకటస్వామి, మరో నలుగురు కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. వీరందరితో నూతన కార్యవర్గంతో మానవత కేంద్ర కమిటీ కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

బుడమేరును నిర్లక్ష్యం చేస్తున్న పాలకులు

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్



మంతెనలో శిథిలమైన బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీపీఐ, రైతు సంఘాల ప్రతినిధులు

కంకిపాడు: ఆపరేషన్ బుడమేరు వెంటనే చేపట్టాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. సీపీఐ, రైతు సంఘాల ప్రతినిధులతో కలిసి శనివారం కంకిపాడు మండలంలోని బుడమేరు ప్రభావిత ప్రాంతాలైన ఉప్పలూరు, వేల్పూరు, మంతెన, తెన్నేరు తదితర గ్రామాల్లో పర్యటించారు. బెజవాడ దుఃఖదాయనిగా పేరొందిన బుడమేరును పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వరదలతో అనేక ప్రాంతాల్లో గండ్లు పడి పొలాలు నీట మునిగిపోయి, ఇళ్లు ధ్వంసమై ప్రజలు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి మురుగు పారుదల అవ్వటం లేదన్నారు. ఆధునీకీకరణ పనులను చేపట్టకుండా రైతులను నిర్లక్ష్యం చేస్తూ పాలకులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ బుడమేరుపై ఈనెల 6న విజయవాడలో నిర్వహిస్తున్న రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ బుడమేరు దుస్థితిని ఇరిగేషన్ మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు పట్టించుకోలేదన్నారు. బుడమేరు ప్రారంభం నుంచి సముద్రంలో కలిసే వరకూ ఉన్న అనేక ప్రదేశాల్లో ఆక్రమణకు గురై కుంచించుకు పోయి తన స్వరూపాన్ని కోల్పోయిందన్నారు. తక్షణమే ఆక్రమణలను తొలగించి బుడమేరు ఆధునీకీకరణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యలమందారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, నాయకులు పి.నాగేశ్వరరావు, కాట్రగడ్డ రామచంద్రజోషి, కట్టవరపు విజయరావు, నూతక్కి మోహన్‌రావు, చాగంటిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

జిల్లా నోడల్ అధికారి, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి



రైతులకు సూచనలు ఇస్తున్న కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి

కంకిపాడు: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని వికసిత్ కృషి సంకల్ప అభియాన్ జిల్లా నోడల్ అధికారి, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పిలుపు మేరకు శనివారం పునాదిపాడు గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అనువైన విత్తనాలను ఎంపిక చేసుకుని మేలైన పద్ధతుల్లో సాగు చేపట్టాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని కోరారు. భూ సార పరీక్షలు, పచ్చిరొట్ట పైర్లు సాగుతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తల బృందం రైతులకు సాగు పద్ధతులను వివరించారు. ఏఎంసీ చైర్మన్ అన్నే ధనరామకోటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారిఎస్‌వైవీఎస్ మనోహర్‌రావు, పామర్రు ఏడీఏ స్వర్ణలత, శాస్త్రవేత్తలు డాక్టర్ శిరీష, డాక్టర్ అనిత, డాక్టర్ నవీన్, ఏఓ పీఎం కిరణ్ పాల్గొన్నారు.

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు



హనుమాన్‌జంక్షన్(గన్నవరం): స్థానిక ప్రసిద్ధ శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానాన్ని ఏపీ రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ గణేష్‌కుమార్, సత్యవతి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీఅభయాంజస్వామికి గణేష్‌కుమార్ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు చైర్మన్ దంపతులకు స్వామివారి శేష వస్త్రాలు, చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎంతో విశిష్టత కలిగిన అభయాంజనేయుని ఆలయాన్ని దర్శించుకోవడం ఆనందంగా ఉందని గణేష్‌కుమార్ తెలిపారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వేగిరెడ్డి పాపారావు, మాజీ సర్పంచి చింతల వెంకటశివఅప్పారావు, కాంగ్రెస్ నాయకులు వేగిరెడ్డి బాలాజీ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల నిలదీత

మండల పరిషత్ సమావేశంలో వాడీవేడిగా చర్చ



సభ్యులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇస్తున్న ఆర్‌అండ్‌బీ ఏఈ మల్లికార్జున

కంకిపాడు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. అభివృద్ధిపై ఏడాది కాలంగా చెబుతున్న బూటకపు మాటలతో ప్రజల ఇబ్బందులు అధికమయ్యాయే తప్ప పరిష్కారం కాలేదంటూ మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమ పాలనపై వాడీవేడిగా చర్చ సాగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ అన్నే ధన రామ కోటేశ్వరరావు గత ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధిని విస్మరించారంటూ వ్యాఖ్యలు చేయటంతో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధిపై దృష్టి సారించలేదనటం వాస్తవం కాదన్నారు. అభివృద్ధితో పాటుగా సంక్షేమ పాలన అన్ని వర్గాలకూ చేరిందన్నారు. ఐదేళ్లలో ప్రతి ఇంటికీ సంక్షేమం అందిందన్నారు. ఏడాది కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పేరు చెప్పుకుంటున్నారే కానీ, చాలా గ్రామాల్లో సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. కుందేరు ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి బిందుమాధవి మాట్లాడుతూ కుందేరులో రైవస్‌కాలువపై బెయిలీ బ్రిడ్జి అధ్వానంగా, ప్రమాదకరంగా మారినా పట్టించుకోవటం లేదన్నారు. రైవస్ కాలువపై చేపట్టిన శాశ్వత వంతెన డిజైన్ మార్పు వల్లే అసంపూర్తిగా మిగిలిందన్నారు. నిర్వాసితులకు పరిహారంతో పాటు, ప్రత్యామ్నాయ స్థలాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ మద్దూరు- గోసాల రోడ్డు ఇసుక లోడు వాహనాలతో అధ్వానంగా మారిందని విమర్శించారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ మల్లికార్జున మాట్లాడుతూ నిధులు విడుదల కాగానే పనులు చేపడతామని వివరణ ఇవ్వటంతో అన్నీ వస్తున్నాయని చెప్పటమే కానీ ఎప్పటికి వస్తాయో చెప్పలేకపోతున్నారని సభ్యులు అసంతృప్తి వ్యక్తపరిచారు. వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాలు ఆశాజనకంగా లేవని, సమస్య ఎక్కడో గుర్తించి పరిష్కరించి మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ వీ భావనారాయణ, పలువురు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ వేదిక నిర్మాణానికి వితరణ



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న కల్యాణ వేదిక నిర్మాణానికి భక్తులు రూ.లక్ష వితరణ చేశారు. శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు భక్తులు గుత్తికొండ ఫణిచైతన్య, ప్రత్యూష దంపతులు, గుత్తికొండ నాగమహీధర్, శశికళ దంపతులు సంయుక్తంగా రూ.లక్ష నగదును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ..అమ్మవారి భక్తులందరి సహాయ, సహకారాలతో శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేదిక నిర్మాణం చేసినట్లు తెలిపారు. పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తేలని గంగూరు గ్రామ ఉద్యోగుల పంచాయితీ

- ఉద్యోగులకు మే నెల జీతాలు అందే పరిస్థితిపై అనుమానం
- తెరపైకి నాల్గవ కార్యదర్శి



గంగూరు గ్రామ పంచాయతీ

పెనమలూరు: గంగూరు గ్రామ పంచాయతీలో కార్యదర్శుల మధ్య మూడు ముక్కలాట మరో కొత్త మలుపు తిరిగి నాలుగు స్తంభాలటగా మారింది. పంచాయతీ కార్యదర్శుల వివాదం కారణంగా మే నెల జీతాలు సచివాలయం ఉద్యోగులకు అందే పరిస్థితి లేకుండా పోయింది. పైగా గంగూరు గ్రామ పంచాయతీకి తెరపైకి కొత్తగా మరో కార్యదర్శి పేరు వినబడుతోంది.

వివరాలు ఇవీ..

గంగూరు గ్రామ పంచాయతీలో గతంలో కార్యదర్శిగా పని చేసిన సుబ్బారావు చిన ఓగిరాలకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కార్యదర్శిగా వెంకటేశ్వరరావు విధుల్లో చేరారు. పాలకులకు కార్యదర్శికి మధ్య సమస్యలు రావటంతో నియోజకవర్గ ముఖ్య నేత కార్యదర్శి వెంకటేశ్వరరావును గరికపర్రుకు బలవంతంగా డెప్యుటేషన్ పై పంపారు. ఆయన స్థానంలో నాగాయలంక నుంచి డెప్యుటేషన్‌పై పవన్‌కుమార్ వచ్చారు. అయితే అతనికి చార్జి అప్పగించలేదు. ఈ ముగ్గురు కార్యదర్శులు తలోదారి వావటంతో గ్రామ పంచాయతీ పాలన అటకెక్కింది.

అందని జీతాలు..

పంచాయతీ కార్యదర్శుల మూడు ముక్కలాట కారణంగా గంగూరులో ఉన్న రెండు సచివాలయాలలో పని చేస్తున్న 16 మంది ఉద్యోగులకు మే నెల జీతాలు సమస్యగా మారాయి. వాస్తవానికి జీతాలు చెల్లించే అధికారం టెక్నికల్‌గా కార్యదర్శి వెంకటేశ్వరరావుకు ఉంది. జీతాల బిల్లు సిద్ధం చేసి ఎంపీడీవో లాగిన్ ద్వారా డ్రా చేయాలి ఉంది. వెంకటేశ్వరరావును బలవంతంగా డెప్యుటేషన్‌పై పంపివేయటంతో ఆయన జీతాల బిల్లు సిద్ధం చేయలేదు. దీనిపై స్పందించాల్సి పూర్వ కార్యదర్శి సుబ్బారావు ప్రేక్షక పాత్రలో ఉండగా, ఇప్పుడు ఉన్న ఇన్‌చార్జి కార్యదర్శి పవన్‌కుమార్ కూడా జీతాల విషయంలో చొరవ తీసుకోలేదు. దీంతో సచివాలయ ఉద్యోగులకు జీతాలు లేక దిక్కు తోచని స్థితిలో ఉన్నారు.

తెరపైకి నాల్గవ కార్యదర్శి..

కాగా గంగూరు గ్రామ పంచాయతీకి కొత్తగా మానికొండ నుంచి ప్రకాష్ అనే కార్యదర్శి బదిలీపై వస్తారని ప్రచారం జరుగుతోంది. ఆయన గంగూరుకు 4వ తేదీన వచ్చే అవకాశం ఉంది. ప్రకాష్ వచ్చిన తరువాత ఆయనకు బాధ్యతలు సకాలంలో అప్పగిస్తే ఆయన సచివాలయ ఉద్యోగుల జీతాలు బిల్లు సిద్ధం అవకాశం ఉంటుంది. ఇదంతా జరగాలంటే జూన్ 15వ తేదీ తరువాత కాని సచివాలయ ఉద్యోగులకు జీతాలు అందే పరిస్థితి లేదు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ఈ ఘటనతో తేటతెల్లమవుతోంది.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారంం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లోని వేణుగోపాల స్వామి వారి ప్రాంతంలో పిళ్లా సాయిలక్ష్మి, వెంకటేష్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరితో పాటు సాయిలక్ష్మి తల్లి బంకా పోలమ్మ(65) ఉంటోంది. ఆమె కొంతకాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆమె మానసిక స్థితి కూడా సరిగా లేదు. మే 29వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన పోలమ్మ సాయంత్రం అయినా తిరిగి రాలేదు. కుమార్తె సాయిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



కంకిపాడు గ్రంథాలయంలో జాతీయజెండాలతో ప్రదర్శన



తెన్నేరులో కుట్లు, అల్లికలపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కంకిపాడు: మండలంలోని తెన్నేరు గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు కుట్లు, అల్లికలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. డి.లక్ష్మి అల్లికల్లో మెలకువలు నేర్పించారు. క్యారమ్స్, చెస్ పోటీలు ఏర్పాటు చేశారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారిఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంలో శిక్షణ ఇచ్చారు. రైల్వే సూపరింటెండెంట్ కె.రాంబాబు నేతృత్వంలో జాతీయ భావాన్ని పెంపొందించేలా విద్యార్థులతో జాతీయ జెండాలతో ప్రదర్శన చేయించారు. శిబిరాన్నిగ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.